

యువకులకు సన్మానం

జన్నారం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : వివిధ శాఖల్లో ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన చింతలపల్లి గ్రామ యువకులను బుధవారం గ్రామ ప్రజలు ఘనంగా సన్మానించారు. ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన గ్రామానికి చెందిన ఇప్ప సతీష్, మహేశ్వరి , శ్రీరాముల హరీష్, ఇప్ప శర్, చంద్రశేఖర్, వొజ్జల సాయిలను ఘనంగా శాలువాలతో సన్మానించారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ

మంచిర్యాల కలెక్టరేట్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) మోకుదెబ్బ జాతీయ కమిటీ నూతన సంవత్సరం క్యాలెండర్లను బుధవారం మంచిర్యాలలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నీలకంటేశ్వర్‌గౌడ్, అనిల్‌గౌడ్‌లు విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌గౌడ్, మురళీగౌడ్, నర్సగౌడ్, వెంకటేశ్వర్లుగౌడ్, అనిల్‌గౌడ్,వినోద్‌గౌడ్, గీత కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయ స్వామి విగ్రహానికి క్షీరాభిషేకం

మందమర్రి టౌన్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో గల 33 అడుగుల ఆంజనేయ స్వామి విగ్రహానికి ధనుర్మాసం సందర్భంగా క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జీఎం ముఖ్య అతిథిగా హాజరై పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు నర్సింహ చార్యులు, అజయ్ చార్యులు, తదితరులు పాల్గొన్నారు.

కొత్త రేషన్ కార్డులకు మోక్షం

రేషన్ కార్డుల కోసం ఎదురు చూస్తున్న మధ్య తరగతి, పేద కుటుంబాలకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. జనవరి 26వ తేదీ నుంచి కొత్త రేషన్‌కార్డు లు అందజేస్తామని ముఖ్యమంత్రి ఇటీవల ప్రకటిం చారు. దీంతో జిల్లాలో 15వేల మందికి కార్డులు అందనున్నాయి.

- ఈ నెల 26 నుంచి జారీకి సన్నాహాలు
- ప్రభుత్వ ప్రకటనతో చిగురిస్తున్న ఆశలు
- ప్రభుత్వ పథకాలు పొందేందుకు తొలగనున్న ఇబ్బందులు
- జిల్లాలో 15వేలకు పైగా దరఖాస్తులు



మంచిర్యాల, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): కొత్త రేషన్ కార్డుల జారీకి ఎట్టకేలకు మార్గం సుగమం అయింది. ఈ నెల 26నుంచి కొత్త రేషన్‌కార్డులు జారీ చేస్తామన్న ప్రభుత్వ ప్రకటనతో దరఖాస్తుదారుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. గత కొన్నాళ్లుగా రాష్ట్రంలో రేషన్ కార్డులు జారీ చేయడం లేదు. దీంతో కుటుంబాలు వేరు పడిన వారితో పాటు కొత్తగా వివాహం చేసుకున్న వారు రేషన్ కార్డులు ఎప్పుడెప్పుడు జారీచేస్తారా అని ఎదురు చూస్తున్నారు. రాష్ట్రంలో అమలయ్యే చాలా ప్రభుత్వ పథకాలకు రేషన్ కార్డు లింక్ ఉండడంతో ఆశావహులు వీటి కోసం నిరీక్షిస్తున్నారు. కొత్త రేషన్ కార్డుల జారీతో పాటు చౌకధరల దుకాణాల్లో సన్న బియ్యం కూడా అందిస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు అనంతరం..

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత తొలుత అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం 2018 వర కు రేషన్ కార్డులను జారీ చేసింది. 2018 డిసెంబరు లో జరిగిన ముందస్తు అసెంబ్లీ ఎన్నికల అనంతరం మళ్లీ అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ పార్టీ రేషన్ కార్డుల జారీ ప్రక్రియను నిలిపివేసింది. ఆ తర్వాత పలువురు దరఖాస్తులు చేసుకోగా చివరగా 2022లో కొందరికి కొత్త కార్డులను జారీ చేశారు. ఆ తరువాత వెబ్‌సైట్‌ను మూసివేసిన ప్రభుత్వం మళ్లీ రేషన్ కార్డులు ఇవ్వలేదు.

గత నవంబరులో జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా తాము అధికారంలోకి వస్తే రేషన్ కార్డులు జారీ చేస్తామని కాంగ్రెస్ పార్టీ ప్రజలకు హామీ ఇచ్చింది. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కొలువు దీరిన అనంతరం. 2023 డిసెంబరు28 నుంచి జనవరి 6వతేదీ వరకు నిర్వహించిన ప్రజాపాలన గ్రామ, వార్డు సభల్లో ఐదు గ్యారంటీ పథకాలు వర్తింపజేసేందుకు దరఖాస్తులు స్వీకరించింది. ఇందులో భాగంగానే కొత్త రేషన్‌కార్డుల కోసం కూడా అధికారులు దరఖాస్తులను స్వీకరించారు. మొదట 2023 డిసెంబరు 9వతేదీ నుంచి ఆరు గ్యారంటీల్లో భాగంగా మహాలక్ష్మి పథకంతో ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం, చేయూత పథకంతో రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం కింద రూ.5 లక్షల నుంచి 10 లక్షలకు ఉచితంగా వైద్య చికిత్స.

- మిగతా 7లో

ఆలయంలో మకర జ్యోతి దర్శనం



తిరువాభరణంతో ఊరేగింపు చేపడుతున్న భక్తులు

దండేపల్లి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గూడెం అయ్యప్ప స్వామి ఆలయంలో అయ్యప్ప స్వాములు, భక్తజనం మధ్య మంగళవారం అయ్యప్ప స్వామి మకర జ్యోతి దర్శనం వైభవంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు శ్రీమాన్ చక్రవర్తుల పురుషోత్తమాచార్యుల ఆధ్వర్యంలో గణపతిహోమం, స్వామికి మహాభిషేకం, ఇరుముడి పూజలు, మూలవిరాట్ నెయ్యాభిషేకం, పంచామృతాభిషేక పూజలు చేశారు.

శబరికి తరలిన అయ్యప్ప స్వాములు

మంచిర్యాల క్రైం, జనవరి 15(ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణం పాత మంచిర్యాల రామలింగేశ్వర ఆలయం నుంచి బుధవారం అయ్యప్ప స్వాముల బృందం శబరి యాత్రకు బయలు దేరింది. ఉదయం 10 గంటలకు 40 మంది అయ్యప్ప స్వాములు శోభాయాత్ర నిర్వహించారు. ప్రజలు మంగళహారతులతో స్వాగతం పలికారు. సేవా సమితి వ్యవస్థాపకులు ఒడ్నాల రవిందర్, ఎర్రం ప్రభాకర్, అమ్రోస్ వెంకటేష్ పాల్గొన్నారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత

దండేపల్లి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): ధ్యానంతో మానసిక ప్రశాంతత లభిస్తుందని హార్ట్ ఫుల్‌నెస్ ధ్యాన కేంద్ర సంస్థ జిల్లా కోఆర్డినేటర్ సీహెచ్ ప్రవీణ, నోడల్ కోఆర్డినేటర్ జి పవన్‌కుమార్ అన్నారు. శ్రీరామచంద్ర మిషన్ హార్ట్ ఫుల్‌నెస్ సంస్థ ఆధ్వర్యంలో దండేపల్లిలోని పద్మశాలి భవనంలో బుధవారం మూడు రోజుల పాటు నిర్వహించే యోగా శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మండల కోఆర్డినేటర్ కోండు జనార్దన్, ట్రైనర్స్ అనిల్‌కుమార్, ఈశ్వరయ్య, ఉపాధ్యాయులు రమేశ్, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

నేడు మెగా వైద్య శిబిరం

కాసిపేట, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) దేవాపూర్ పంచాయతి పరిధిలోని పెద్దాపూర్‌లో గురువారం మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు కాసిపేట మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రవికిరణ్ బుధవారం ఒక ప్రకటలో తెలిపారు. కొలాం గిరిజనులు రోగాల బారిన పడుతున్న నేపథ్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా హాజరవుతారని తెలిపారు.

మనసు దోచే దసలి పట్టు



- కుశ్నపల్లి చేనేత వస్త్రాలకు అతివలు ఫిదా..
- టస్సర్ డ్రెస్సులపై రాజకీయ నాయకుల మోజు
- కష్టనష్టాలతో కులవృత్తికి జీవం పోస్తున్న నేతన్నలు
- ప్రభుత్వం చేయూతనిస్తేనే టస్సర్‌కు భవిష్యత్తు

7

గురుకులం పిలుస్తోంది

- ఫిబ్రవరి 23న అర్హత పరీక్ష
- ఫిబ్రవరి ఒకటి చివరి గడువు
- ఏడాది నుంచి ఐదు నుంచి తొమ్మిది తరగతులకు ఒకేసారి దరఖాస్తుల స్వీకరణ, అర్హత పరీక్ష



6

బీజేపీ నాయకుడిపై దాడి

- చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు

మంచిర్యాల క్రైం, జనవరి 15(ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా కేంద్రంలో బీజేపీ నాయకుడు జయరామారావుపై ముగ్గురు వ్యక్తులు దాడి చేసిన ఘటన చోటు చేసుకుంది. బాధితుడు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బుధవారం గౌతమినగర్‌కు చెందిన జయరామారావు చాపల మార్కెట్‌కు వెళ్లాడు. ఆయన చాపలు కొనుగోలు చేస్తుండగా ముగ్గురు వ్యక్తులు ఒక్కసారిగా దాడికి పాల్పడ్డారు. ఆ ప్రాంతంలో ఉన్న ప్రజలు గుమిగూడడంతో వారు అక్కడ నుంచి వెళ్లిపోయారు. గతంలో బైపాస్‌రోడ్డులో గుడికి వెళ్లే రోడ్డు, డ్రైనేజీ విషయంలో జయరామారావు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ స్థలం మంతెన జగన్మోహన్‌రావుది కావడంతో ఫిర్యాదు చేశాడని కోపంతో దాడికి పాల్పడ్డారని చెబుతున్నారు మంచిర్యాల ఎస్‌హెచ్‌వో ప్రమోద్‌రావుకు జయరామరావు భార్య లక్ష్మి వారి కుటుంబ సభ్యులతో పాటు బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెర్రబెల్లి రఘునాథ్‌రావు ఫిర్యాదు చేశారు.

దాడికి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు

మంచిర్యాల క్రైం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణానికి చెందిన డీటీ సాయితేజ అతని స్నేహితులపై దాడికి పాల్పడిన మిట్టపల్లి జయరామారావుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కిరణ్ కుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం బుధవారం చేపల మార్కెట్‌లో చేపలు కొనుగోలు చేస్తుండగా సాయితేజ అతడి స్నేహితులపై దాడికి పాల్పడ్డారని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



దండేపల్లిలో సంక్రాంతి పండుగ రోజున నోముల పూజలు చేస్తున్న మహిళలు



పతంగులు పంపిణీ చేస్తున్న ఎస్సై రాజశేఖర్

సంక్రాంతి శోభ



ఆకట్టుకుంటున్న ముగ్గు

మంచిర్యాల కలెక్టరేట్/మందమర్రిటౌన్/రూరల్/దండేపల్లి/నస్పూర్/జన్నారం/భీమారం/తాండూర్/వేమనపల్లి/కాసిపేట, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో మంగళవారం సంక్రాంతి శోభ నెలకొంది. జిల్లా కేంద్రంలో మహిళలు వాకిళ్లలో ముగ్గులు వేస్తూ సందడి చేశారు. మందమర్రి పట్టణంలో సంక్రాంతి వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని మార్కెట్ ఏరియా ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో సంక్రాంతి పండుగ సందర్భంగా ఉచితంగా పతంగులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఎస్సై రాజశేఖర్ హాజరై పతంగులు అందజేశారు. . నస్పూర్‌లో ఉదయం నుంచే మహిళలు, యువతులు ఇంటి వాకిళ్లను అందమైన రంగవల్లులతో అలంకరించారు. దండేపల్లి మండలంలోని ఆయా గ్రామాల్లో అన్ని వీధుల్లో రంగవల్లిలతో కొత్త శోభ సంతరించుకుంది. మందమర్రి మండలం పొన్నారం గ్రామంలో దొండ సంపత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో పాల్గొన్న విజేతలకు ఎస్ఐ రాజశేఖర్ బహుమతులు అందజేశారు. జన్నారం మండలంలో ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో గాలిపటాల పోటీలను నిర్వహించారు. భీమారం రామాలయంతో పాటు వివిధ ఆలయాల్లో ప్రజలు ప్రత్యేక పూజలు చేశారు



బహుమతులు అందజేస్తున్న ఎస్ఐ రాజశేఖర్

గాయపడిన వ్యక్తికి పరామర్శ

గర్మిళ్ల, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : మంచిర్యాల జిల్లా కేంద్రంలో జయరామారావు అనే వ్యక్తిపై ఇటీవల కొందరు దుండగులు దాడి చేయడంతో ఆసుపత్రిలో చికిత్సపొందుతున్న అతడిని బుధవారం మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నడిపెల్లి విజిత్‌కుమార్ ఉన్నారు.

పద్మశాలి సంఘం గ్రామ కార్యవర్గం

జన్నారం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : దేవునిగూడ, కామన్‌పల్లి పద్మశాలి సంఘం నూతన కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సాట్ల మల్లేష్, ఉపాధ్యక్షులుగా పిరిపురం రామన్న, ప్రధాన కార్యదర్శిగా సాట్ల తిరుపతి, కార్యదర్శిగా మల్లేష్, క్యాషియర్‌గా మల్లేష్, ప్రచార కార్యదర్శులుగా సత్తయ్యలను ఎన్నుకున్నారు.

నేటి నుంచి రైతుభరోసా గ్రామసభలు

కాసిపేట, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలో గురువారం నుంచి రైతు భరోసా గ్రామ సభలు నిర్వహించనున్నట్టు తహసీల్దార్ భోజన్న బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం నుంచి 20వ తేదీ వరకు 22 గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అర్హులైన రైతులందరు పట్టాదారు పాసుపుస్తకంతో పాటు గ్రామ సభలకు హాజరై పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డు జారీ ప్రక్రియ ప్రారంభిస్తామని తెలిపారు.

నేడు పోచమ్మ బోనాలు

కోటపల్లి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆలుగామ గ్రామంలో గురువారం పోచమ్మ బోనాలు, శుక్రవారం లక్ష్మీదేవి బోనాలు నిర్వహించను న్నామని ఆలుగామ మాజీ సర్పంచు కుమ్మరి సంతోష్, గ్రామ పెద్దలు, గుడి నిర్వహకులు మానెపల్లి బాపు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బోనాలకు భక్తులు వచ్చి తమ మొక్కులు చెల్లించుకోవాలని కోరారు.

ఉపాధ్యాయుడికి మంద కృష్ణ పరామర్శ

మందమర్రి టౌన్, జనవరి 15(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఊరు మందమర్రి జిల్లా పరిషత్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న పొడేటి సంజీవ్‌ను ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మంద కృష్ణ బుధవారం పరామ ర్శించారు. ఇటీవల హైదరాబాద్‌లో మాదిగ ఎంప్లాయిస్‌ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి వెళ్తుండగా ప్రమాదానికి గురయ్యాడు కాలు విరిగిపోవడంతో హైదరాబాద్ నిమ్స్‌లో చికిత్స పొందుతున్న ఆయనను మందకృష్ణ పరామర్శించి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

అర్హులందరికీ పరిహారం



వివరాలను పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్‌దీపక్

మంచిర్యాల కలెక్టరేట్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారుల నిర్మాణంలో భాగంగా మంచిర్యాల-వరంగల్-ఖమ్మం-విజయవాడ జాతీయ రహదారి 163జీ నిర్మాణంలో భూములు కోల్పోయిన అర్హులైన ప్రతి ఒక్కరికి పరిహారం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయంలో బుధవారం జాతీయ రహదారి విస్తరణలో భూములు కోల్పోయిన వివరాలను ఆర్డీవో శ్రీనివాస్‌రావుతో కలిసి పరిశీలించారు. రికార్డులు పరిశీలించి అర్హత ఉంటే పరిహారం చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.

బహుమతులు అందజేత

తాండూర్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : తాండూర్ మండల యూత్ కమిటీ ఆధ్వర్యంలో సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన కబడ్డీ పోటీల్లో గెలుపొందిన వారికి బుధవారం బహుమతులు అందజేశారు. బహుమతుల ప్రధానానికి తాండూర్ సీఐ కుమార స్వామి హాజరై మొదటి బహుమతి తాండూర్ టీంకు రూ. 7 వేలు, రెండో బహుమతి తంగళ్లపల్లి టీంకు రూ. 5 వేలను అందజేశారు.

అరకొర వేతనం.. పనిభారం

- నష్టపోతున్నామని ఆవేదన
- ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వినతి



పనులు చేస్తున్న ఉపాధిహామీ కూలీలు(ఫైల్)

మందమర్రిరూరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): చాలీచాలని వేతనాలు అధిక పనిభారంతో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్‌లు ఇబ్బందులు పడుతున్నారు. కేంద్ర ప్రభుత్వం వలసలను నివారించడానికి పేదలకు పనులను కల్పించాలని ఉపాధిహామీ పథకానికి శ్రీకారం చుట్టింది. ఈ పనులను క్షేత్రస్థాయిలో ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్‌లు పర్యవేక్షిస్తుంటారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు గ్రామాల్లో కూలీలను మానిటరింగ్ చేస్తూ వారికి కేటాయించిన పనులను కూలీలతో చేయిస్తుంటారు. మొత్తం 24 రకాల పనులను ఫీల్డ్ అసిస్టెంట్‌లు కూలీలతో చేయిస్తారు. ఈ క్రమంలో ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన జీవో ప్రకారం వారిని కేటగిరీలుగా విభజిస్తూ వేతనాలు అందిస్తోంది. దీంతో ఫీల్డ్ అసిస్టెంట్‌లు నష్టపోతున్నారు. ఈ జీవోను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఏ కేటగిరి కింద ఉన్న వారికి రూ. 13 వేలు, బీ కేటగిరి కింద రూ. 9,500, సీ కేటగిరి కింద ఉన్న రూ. 8 వేలను చెల్లిస్తున్నారు. వర్క్ పెర్ఫామెన్స్‌ను బట్టి కేటగిరిల కింద ఫీల్డ్ అసిస్టెంట్‌లను విభజించి వేతనాలు అందిస్తున్నా రు. దీంతో చాలీచాలని వేతనాలతో ఫీల్డ్ అసిస్టెంట్‌లు ఇబ్బందులు పడుతున్నారు. రోజురోజుకు పెరుగుతున్న నిత్యావసరాలతో తమకందుతున్న వేతనాలు ఏ మూలకు సరిపోవడం లేదని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వేతనాలు పెంచాలని, హెల్త్‌కార్డులు ఇవ్వాలని, 4779 జీవోను రద్దు చేయాలని కోరుతున్నారు.

గౌరవ వేతనం రూ.26 వేలు ఇవ్వాలి

నేను 19 సంవత్సరాలుగా ఉపాధిహామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నా. వేతనాలు తక్కువగా ఉండడంతో ఇబ్బందులు పడుతున్నాం. ఫీల్డ్ అసిస్టెంట్‌లకు నెలకు రూ.26 వేల వేతనం చెల్లించాలని, హెల్త్ కార్డులు ఇవ్వాలి. ఉద్యోగ భద్రత కల్పించాలి.

- లింగయ్య, ఫీల్డ్ అసిస్టెంట్‌ల సంఘంజిల్లా అధ్యక్షుడు

ఇంటర్వ్యూ....

అడవుల రక్షణ అందరి బాధ్యత

● మజారోద్దీన్, ఎఫ్ఆర్వో



ఆంధ్రజ్యోతి: అడవుల రక్షణకు తీసుకుంటున్న చర్యలేమిటి?

ఎఫ్ఆర్వో: అటవీప్రాంతం చుట్టూ కందకాలు, కంచెలు ఏర్పాటు చేసి పశువులు అడవుల్లోకి వెళ్లకుండా చర్యలు చేపడుతున్నాం. అడవులరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అవగాహన కల్పిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: పులుల ఆవాసానికి ఎలాంటి చర్యలు తీసుకుం టున్నారు?

ఎఫ్ఆర్వో: అడవిలోకి పులి వచ్చి పోతోంది. శాశ్వత ఆవాసం కొరకు ఈ అడవుల్లో శాఖాహార జంతువుల సంఖ్యను పెంచుతున్నాం. తాగునీటి కోసం చెక్‌డ్యాంలను, నీటికుంటలను నిర్మించాం. వేటగాళ్ల నుంచి రక్షణకై నిఘా బృందాలను ఏర్పాటు చేశాం.

ఆంధ్రజ్యోతి: కలప అక్రమ రవాణా నివారణకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

ఎఫ్ఆర్వో : కలప అక్రమరవాణా నివారణకు అటవీబీట్ అధికారులు, అటవీరేంజ్, సెక్షన్ అధికారులు నిత్యం అటవీ ప్రాంతంలో గస్తీ తిరుగుతున్నాం. గ్రామాల్లో సమాచార వ్యవస్థ ఏర్పర్చుకున్నాం. అక్రమ రవాణాకు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేస్తున్నాం.

- ఫిబ్రవరి 23న అర్హత పరీక్ష
- ఫిబ్రవరి ఒకటి చివరి గడువు
- ఈ ఏడాది నుంచి ఐదు నుంచి తొమ్మిది తరగతులకు ఒకేసారి దరఖాస్తుల స్వీకరణ, అర్హత పరీక్ష



గురుకులం పిలుస్తోంది..

బెజ్జూరు, జనవరి 15(ఆంధ్రజ్యోతి): విద్యా సంవత్సరం(2025-26)లో గురుకుల పాఠశాలల్లో చేపట్టే ప్రవేశాలకు ప్రభుత్వం దరఖాస్తుల స్వీకరణ చేపట్టింది. ఈ ఏడాది చేరికల్లో కొన్ని మార్పులు చేసింది. గతంలో ఆధార్ కార్డు, మొబైల్ నంబర్ ఉంటే దరఖాస్తు చేసుకునే అవకాశం ఉండేది. ఈ ఏడాది నుంచి కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలను ముందే సమర్పించి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. గతంలో ఐదో తరగతి ఒకసారి, ఆరునుంచి తొమ్మిదో తరగతుల్లో ప్రవేశాలకు మరోవిడత దరఖాస్తుల స్వీకరణ ఉండేది. అర్హత పరీక్షలు సైతం వేర్వేరు తేదీల్లో నిర్వహించేవారు. ఈ ఏడాది నుంచి ఐదు నుంచి తొమ్మిది తరగతులకు ఒకేసారి దరఖాస్తుల స్వీకరణ, అర్హత పరీక్ష నిర్వహించే ఏర్పాట్లు చేస్తోంది. ఉమ్మడి జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విభాగాల గురుకులాలు మొత్తం మహాత్మా జ్యోతిబాపూలే 26, సాంఘిక సంక్షేమ 22, మైనార్టీ సంక్షేమ 14, గిరిజన సంక్షేమ 22 పాఠశాలలు ఉన్నాయి.

ఆయా తరగతుల దరఖాస్తుకు కింది తేదీల మధ్య జన్మించిన వారు అర్హులు..

తరగతి	తేదీ నుంచి	వరకు
ఐదు	01-09-2012	31-08-2016
ఆరు	01-09-2011	31-08-2015
ఏడు	01-09-2010	31-08-2014
ఎనిమిది	01-09-2009	31-08-2013
తొమ్మిది	01-09-2008	31-08-2012

● **అవసరం ఉన్నవి..**

ప్రస్తుతం చదువుతున్న పాఠశాల నుంచి బోనఫైడ్ లేదా జనన ధ్రువీకరణ పత్రం జతచేయాలి. ఆధార్‌కార్డుతో పాటు మొబైల్ నంబరు ఒక దరఖాస్తుకు మాత్రమే పనిచేస్తుంది. విద్యార్థి ఫొటోతోపాటు గ్రామీణ ప్రజల వార్షిక ఆదాయం రూ.1.50లక్షలు ఉండాలి. పట్టణ ప్రజల వార్షిక ఆదాయం రూ.2లక్షలలోపు మాత్రమే ఉండాలి.

● **ఫిబ్రవరి ఒకటి చివరి గడువు..**

2024 డిసెంబరు 21వ తేదీ నుంచి దరఖాస్తుల స్వీకరణ మొదలైంది. ఇంటర్నెట్‌లో గడువు ముగింపు తేదీ 1-02-2025వరకు ఉంది. ఫిబ్రవరి 23 2025న ఎంపిక చేసిన కేంద్రాల్లో అర్హత పరీక్ష నిర్వహించనున్నారు. ముఖ్యంగా 2025-26విద్యా సంవత్సరానికి గురుకులంలో పైతరగతులకు దరఖాస్తులు చేసుకోవాలనుకునే విద్యార్థులు మీ-సేవా కేంద్రాల ద్వారా ముందుగా కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు పొందాల్సి ఉంటుంది.

ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన కారు

- భార్య మృతి, భర్తకు గాయాలు



ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

బెల్లంపల్లి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి పట్టణంలోని గంగారాంనగర్ వద్ద ఆగి ఉన్న లారీని కారు ఢీకొన్న ప్రమాదంలో భార్యమృతి చెందింది. ఈ ప్రమాదంలో పాటు భర్తకు గాయాలయ్యాయి. బెల్లంపల్లి టూ టౌన్ ఎస్‌ఐ మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లో మెకానికల్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న అక్కు రాజేష్, ఆయన భార్య రేణుక, కుమారుడు వేదిక్‌తో కలిసి మంగళవారం కారులో హైదరాబాద్ నుంచి కాగజ్‌నగర్‌కు వెళ్తున్నారు. ఈ క్రమంలో బెల్లంపల్లిలోని గంగారాంనగర్ వద్ద రాత్రి ఆగి ఉన్న లారీనీ అతి వేగంగా ఢీకొట్టడంతో కారులో ముందు సీట్లో ఉన్న రేణుక (28) అక్కడికక్కడే మృతిచెందింది. భర్త రాజేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. కారు వెనక సీట్లో కూర్చున్న వారి కుమారుడు వేదిక్‌కు ఎలాంటి గాయాలు కాలేదు. స్థానికులు సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించామి ఎస్సై తెలిపారు. రాజేష్‌ను మెరుగైన వైద్యం కోసం మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు. రాజేష్ తల్లి పద్మఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి



శ్రీరామ్(ఫైల్)

కాసిపేట, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): కాసిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని పెద్దనపల్లి నాయకపుగూడకు చెందిన పల్లె శ్రీరామ్(19) అనే వ్యక్తి మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు కాసిపేట ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. పోలీసులుతెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం సోమగూడెం నుంచి సిమెంటు ఇటుక లోడ్‌తో ట్రాక్టర్‌లో దేవాపూర్‌కు వెళ్లి అన్‌లోడ్ చేశారు. తిరిగి వస్తుండగా కాసిపేట 1వ గని సమీపంలోకి రాగానే ట్రాక్టర్ డ్రైవర్ పంది లక్ష్మణ్ అతి వేగంగా అజాగ్రత్తగా నడపడంతో శ్రీరాం ట్రాక్టర్‌పై నుంచి కింద పడ్డాడు. ఈ క్రమంలో ట్రాక్టర్ టైరు అతడిపై నుంచి వెళ్లడంతో తీవ్రగాయాలపాలయ్యాడు. స్థానికులు మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. ఈ మేరకు కుటుంబీకుల ఫిర్యాదు మేరకు అజాగ్రత్తగా నడిపిన ట్రాక్టర్ డ్రైవర్ పంది లక్ష్మణ్‌పై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న పశువులు పట్టివేత

జైపూర్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : మహారాష్ట్ర నుంచి అక్రమంగా పశువులను తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై శ్రీధర్ అన్నారు. పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలానికి చెందిన గంట రాజు మహారాష్ట్రలో ఒక సంతలో నుంచి సరైన పత్రాలులేకుండా ఐదు ఆవులు, రెండు దూడలను కొనుగోలు చేసి అశోక్ లేల్యాండ్ ట్రాలీలో తరలిస్తుండగా సుందిళ్ల బ్యారేజీ వద్ద పట్టుకున్నామన్నారు. వాహనాన్ని సీజ్ చేసి గంట రాజుపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పశువుల ను మంచిర్యాలలోని గో శాలకు తరలించామని తెలిపారు.

యువకుడి ఆత్మహత్య



నవీన్(ఫైల్)

బెజ్జూరు, జనవరి 15(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన కావిడే నవీన్(26) మంగళవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. నవీన్ కొద్ది రోజులుగా తాగుడుకు బానిసయ్యాడు. నిత్యం తాగి ఇంటికి వస్తుండడంతో తల్లితండ్రులు మందలించారు. దీంతో మనస్థాపానికి గురై ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడు. గమనించిన కుటుంబీకులు వెంటనే అతన్ని కాగజ్‌నగర్ పట్టణానికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందాడు. మృతుడి తండ్రి దేవయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

కోడి పందేల స్థావరంపై దాడి

చింతలమానేపల్లి, జనవరి 15(ఆంధ్రజ్యోతి): మండలం లోని రన్‌వెల్లి గ్రామశివారులో మంగళవారం కోడిపందేలు నిర్వహిస్తుండగా సమాచారం అందుకున్న ఎస్సై నరేష్ ఆధ్వర్యంలో పోలీసులు దాడిచేసి ముగ్గురిని పట్టుకున్నారు. వారి వద్ద రెండు కోడి పుంజులు, రూ.1550 నగదు, మూడు ద్విచక్రవాహనాలు స్వాధీనపర్చుకున్నట్లు తెలిపారు.

కోడి పందేలు ఆడుతున్న ముగ్గురి అరెస్టు

దహెగాం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మొట్లగూడ శివారులోని ప్రాణహితనది సమీపంలో బుధ వారం కోడి పందేలు నిర్వహిస్తున్న ముగ్గురిని పట్టుకున్నట్లు ఎస్సై రాజు తెలిపారు. వారి వద్ద నుంచి రెండు కోడి పుంజులు, రూ.1350 నగదు స్వాధీనపర్చుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

ఒకరికి గాయాలు

బెజ్జూరు, జనవరి 15(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జ్యోతిబాపూలే విగ్రహం వద్ద బుధవారం రాత్రి ద్విచక్ర వాహనం అదుపుతప్పడంతో ఒకరికి తీవ్రగాయాలు అయ్యాయి. కౌటాల మండలంలోని గిన్నెలేటి గ్రామానికి చెందిన మోర్లె దివాకర్ అత్తగారి ఇంటికి ద్విచక్ర వాహనంపై వెళ్తున్న క్రమంలో అదుపుతప్పి కింద పడిపోయాడు. ఈ ప్రమాదంలో అతని కాలు విరిగింది. స్థానికులు వెంటనే అతన్ని బెజ్జూరు పీహెచ్‌సీకి తరలించి అక్కడి నుంచి కాగజ్‌నగర్‌కు తరలించారు.

లక్ష్మీపూర్‌లో పరుగు పందెం పోటీలు

భీమిని, జనవరి (ఆంధ్రజ్యోతి) : మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలో బుధవారం శ్రీరామ సేవా సమితి ఆధ్వర్యంలో యువకులకు పరుగు పందెల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్సై విజయ్ కుమార్ పాల్గొని యువకులను అభినందించారు. 500 మీటర్ల పరుగు పందెంలో మొదటి బహుమతి కామెర చంద్రకాంత్, రెండవ బహుమతి దొరిషెట్టి విష్ణు, 300 మీటర్ల పందెంలో ఆకిరెడ్డి అరవింద్ మొదటి బహుమతి, రెండో బహుమతి పోతురాజుల సుతీక్షన్ సాధించారు. కార్యక్రమంలో రాజయ్య, లక్ష్మణ్, శ్రీనివాస్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

రేపు ఉపాధిహామీ ప్రజావేదిక

కాసిపేట, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో శుక్రవారం ఉపాధిహామీ 14వ విడత ప్రజావేదిక నిర్వహించనున్నామని ఎంపీడీవో సత్యనారాయణసింగ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధి హామీ సిబ్బంది అధికారులు హాజరు కావాలని కోరారు.

క్రీడల్లో రాష్ట్ర స్థాయిలో రాణిస్తేనే గుర్తింపు: ఎమ్మెల్యే



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు

బెజ్జూరు, జనవరి 15(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో యువత క్రీడలపై పట్టు సాధించి రాష్ట్ర స్థాయిలో రాణిస్తేనే గుర్తింపు లభిస్తుందని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని కుంటలమానేపల్లిలో కుమరంభీం స్మారక కబడ్డీ, వాలీబాల్ క్రీడల ముగింపులో పాల్గొని విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామస్థాయిలో కాకుండా రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటాలని ఇందుకు తనవంతు ప్రోత్సాహం అందజేస్తానన్నారు. క్రీడలకోసం ప్రభుత్వ స్థలాన్ని క్రీడాస్థలంగా మార్చేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో నాయకులు మనోహర్‌గౌడ్, బాపు, విజయ్, వెంకటేష్, వసీఖాన్, భిక్షపతి, రాజేష్, బాలకృష్ణ, తుకారాం, రాజన్న, దిగంబర్ తదితరులు పాల్గొన్నారు.

మాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా లెండుగురే శ్యాంరావు

కాగజ్‌నగర్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్‌లో మంగళవారం మాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లెండుగురే శ్యాంరావును బీఆర్‌ఎస్ ట్రేడ్‌యూనియన్ నాయకులు ఘనంగా సన్మానించారు. మాలి సంఘం రాష్ట్ర ఎన్నికల్లో శ్యాంరావు 170ఓట్లతో గెలుపొందడంతో బీఆర్‌ఎస్ ట్రేడ్ యూనియన్ నాయకుడు అంబాల ఓదెలు ఆధ్వర్యంలో నాయకులు ఆయనను ఘనంగా సన్మానించారు. అనంతరం రాష్ట్రఅధ్యక్షుడు మట్లాడుతూ మాలిసంక్షేమం కోసం తనవంతు కృషిచేస్తానన్నారు. కార్యక్రమంలో నాయకులు గోగర్ల కన్నయ్య, అంబాల ఎల్లయ్య, ఆదేరాజు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సైకిల్ పోటీలు

హాజీపూర్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : హాజీపూర్ ప్రెస్‌క్లబ్‌ఆధ్వర్యంలో మండలంలోని గుడిపేటలో సంక్రాంతి పండగ సందర్భంగా మంగళవారం నిర్వహించిన సైకిల్ రేస్ పోటీల్లో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆయా గ్రామాల నుంచి మొత్తం 120 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. ఈ పోటీలను ఎస్‌ఐ గోపతి సురేష్ జెండా ఊపి ప్రారంభించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ సైకిల్ పోటీల్లో చిన్నారుల్లో ఉత్సాహం, మానసికధైర్యాన్ని నింపుతాయన్నారు. 1,2,3తరగతుల విభాగంలో అశిశ్, హర్షివర్ధన్, 4,5 తరగతుల విభాగంలో నిఖిలేందర్, అశ్విత్‌వర్మ, 6,7తరగతుల విభాగంలో అభిలాష్,అర్మాన్, విద్యార్థినుల విభాగంలో శివకారుణ్య, ప్రజ్వల విజేతలుగా నిలిచారు. మొదటి బహుమతి రూ.3వేలు, రెండవ బహుమతి రూ.1500లతో పాటు పతకాలను ఎస్‌ఐ అందజేశారు. కార్యక్రమంలో మంచిర్యాల పీఏసీఎస్ వైస్ చైర్మన్ రాసమల్ల శ్రీనివాస్‌గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సత్యగౌడ్, కాంగ్రెస్‌మండల అధ్యక్షుడు తోట రవి, ఒడ్డేశ్రీనివాస్, మాజీఎంపీటీసీ బాలరాజు, మాజీ వార్డు సభ్యుడు కందుల రమేష్, కాంగ్రెస్‌నాయకులు పాల్గొన్నారు.

ఎస్సైకి సన్మానం

తిర్యాణి, జనవరి15(ఆంధ్రజ్యోతి): మండల నూతన ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన శ్రీకాంత్‌ను బుధవారం మోకుదెబ్బ గౌడ సంఘం సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గౌడసంఘం నాయకులు శ్రీనివాస్ గౌడ్, శంకర్‌గౌడ్, శంకర్‌గౌడ్, అశోక్‌గౌడ్, లచ్చగౌడ్, కొమురయ్య, వెంకటేశంగౌడ్, బాలేష్‌గౌడ్, నర్సగౌడ్, బాపగౌడ్, సత్యగౌడ్, మల్లగౌడ్, నారాయణగౌడ్, అరుణ్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు

పెంచికలపేట, జనవరి 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని కమ్మర్‌గాం నుంచి మొర్లిగూడ గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారికి బుధవారం మరమ్మతులు నిర్వహించారు. గతంలో కురిసిన వర్షాలకు రోడ్డు గుంతలమయంగా మారడంతో గ్రామస్థులు ఎమ్మెల్సీ దండె విఠల్‌కు సమస్యను వివరించారు. వెంటనే స్పందించిన ఆయన ఎమ్మెల్సీ నిధుల నుంచి మూడు లక్షల మంజూరు చేయడంతో మరమ్మతులు నిర్వహిస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ పుష్పలత, మధునయ్య, కృష్ణ, శంకర్‌గౌడ్, ప్రభాకర్, శ్రీనివాస్, చందు, బాపు, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

అర్హుల గుర్తింపునకు సర్వే

జైపూర్, జనవరి 15(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో కొత్త రేషన్‌కార్డులు అందజేసేందుకు అర్హులను గుర్తించేందుకు బుధవారం ఎంపీడీవో సత్యనారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ విద్యాసాగర్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వారి పూర్తివివరాలను సేకరించామని చెప్పారు. అర్హులకు అందజేసేందుకే క్షేత్ర స్థాయిలో పరిశీలించామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీవో శ్రీపతి బాపురావు, పంచాయతీ కార్యదర్శి ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తాండూరులో..

తాండూర్: ఆహార భద్రత కార్డు దరఖాస్తులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మండల అధికారులు బుధవారం మాదారం పంచాయతీలో పర్యటించి ఆహార భద్రత కార్డు దరఖాస్తులను ఇంటింటికి తిరుగుతూ క్షేత్రస్థాయిలో విచారణ చేశారు. కార్యక్రమంలో మండల తహసీల్దార్ ఇమ్రాన్, ఎంపీడీవో శ్రీనివాస్, నాయబ్ తహసీల్దార్ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్, ఎంపీడీవో

సిర్పూర్(టి), జనవరి 15(ఆంధ్రజ్యోతి): మండలంలో గురువారం నుంచి ప్రారంభించే ఇందిరమ్మ ఇళ్ల, ఆత్మీయ భరోసా, రైతుభరోసా, రేషన్‌కార్డు సర్వే ప్రక్రియపకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో సత్యనారాయణ, ఏవో గిరీష్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రైతువేదికలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ ప్రక్రియను ఏ ఒక్కరూ తప్పి పోకుండా పకడ్బందీగా నిర్వహించాలన్నారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

మహాపాదయాత్ర పోస్టర్ల ఆవిష్కరణ

బెజ్జూరు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్కపల్లి అభయాంజనేయస్వామి ఆలయం నుంచి మహారాష్ట్రలోని చప్రాల ఆధ్యాత్మిక కేంద్రానికి ఈ నెల 18న నిర్వహించే 20వ మహాపాదయాత్ర పోస్టర్లను మంగళవారం చప్రాల ఆధ్యాత్మిక కేంద్రంలో ఆలయకమిటీ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. మహాపాదయత్రలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



పాదయాత్ర పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

లబ్ధిదారుల ఎంపిక పకడ్బందీగా చేపట్టాలి

జైపూర్, జనవరి 15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయభరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మఇళ్ల లబ్ధిదారుల ఎంపిక సర్వేను పకడ్బందీగా చేపట్టాలని ఎంపీడీవో సత్యనారాయణ అన్నారు. బుధవారం మండలకేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో పంచాయతీకార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది లబ్ధిదారుల ఎంపికపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సమావేశంలో ఎంపీవో శ్రీపతి బాపురావు, వ్యవసాయాధికారి మార్క్‌గ్లాడ్‌స్టన్, ఏపీడీ మల్లేష్, ఆర్‌డబ్ల్యూ ఎస్‌డీఈ విద్యాసాగర్, ఆర్‌ఐతిరుపతి, ఏపీవో బాలయ్య, ఏపీఎం, ఏఈవోలు,కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉంటేనే వ్యాధులకు అడ్డుకట్ట

దండేపల్లి, జనవరి 15(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులను ప్రబలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారులు డాక్టర్ సతీష్, వంశీకృష్ణ సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జాతీయ ఆరోగ్య మిషన్ ఆరోగ్య కార్యక్రమాలు, వైద్య సేవలపై దండేపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో బుధవారం దండేపల్లి, చింతపల్లి, రెబ్బనపల్లితోపాటు గిరిజన గ్రామాలోని తెలంగాణ సాంస్కృతి సారథికళాకారులు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు.జిల్లా ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్‌హరీశ్‌రాజ్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పరిశుభ్రత పాటించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా మాస్ మీడియా అధికారి బుక్కవెంకటేశ్వర్, రాజారెడ్డి, పోసాని వసంత్‌కుమారి పాల్గొన్నారు.



పోటీల్లో బహుమతులు సాధించిన ఎస్టీపీపీ ఉద్యోగులు

జైపూర్, జనవరి 15(ఆంధ్రజ్యోతి): పశ్చిమ బెంగాల్‌లోని అసన్‌సోల్‌లో ఈనెల 14, 15తేదీల్లో కోల్ ఇండియా నిర్వహించిన ఇంటర్ కంపెనీ కల్చరల్ మీట్ 2024-25 అనుబంధ ఈస్టర్న్ కోల్ ఫీల్డ్ లిమిటెడ్ కంపెనీ పోటీల్లో జైపూర్‌లోని సింగరేణి థర్మల్ పవర్‌ప్లాంట్ ఉద్యోగులు బహుమతులు గెలుచుకున్నట్లు ఎస్టీపీపీ ఈడీ ఎన్‌వీ రాజశేఖర్‌రావు తెలిపారు. ఆయన మాట్లాడుతూ బి రవీంద్రకుమార్ స్వామి వేణుగానంలో, బి శ్రీనిధి కర్ణాటక సంగీతంలో మొదటి బహుమతులు గెలుచుకున్నారన్నారు. ప్రతివ్యక్తి ఏదో కళను నేర్చుకోవాలన్నారు. ఉద్యోగులు ఎంతో కొంత పని ఒత్తిడికి, మానసిక ఆందోళనకు గురవుతున్నారన్నారు. కళల ద్వారా మానసిక ఉల్లాసం పొందవచ్చన్నారు. అధికారులు బహుమతులు సాధించిన వారిని అభినందించారు.



కర్ణాటక సంగీత పోటీలో పాడుతున్న శ్రీనిధి

సొంతింటి కల అమలు చేయిస్తాం

● రాష్ట్ర కనీస వేతనాల సలహామండలి చైర్మన్ జనక్‌ప్రసాద్



జనక్‌ప్రసాద్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

మందమర్రి టౌన్, జనవరి 15(ఆంధ్రజ్యోతి): సింగరేణిలో కార్మికులు ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న సొంతింటి కలను అమలు చేస్తామని రాష్ట్ర కనీస వేతనాల సలహామండలి చైర్మన్ జనక్‌ప్రసాద్ తెలిపారు. మంగళవారం సంక్రాంతి పండుగ సందర్భంగా మందమర్రికి చెందిన ఐఎన్టీయూసీ నేతలు ఆయనను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల మందమర్రిలో జనరల్ బాడీ సమావేశాన్ని విజయవంతం చేశారన్నారు. విధానపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

ఏరియాలవారీగా సమావేశాలు పెట్టి సమస్యల పై చర్చిస్తామన్నారు. సింగరేణిలో గుర్తింపు సంఘం చేసింది శూన్యమన్నారు. రాబోయే గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఐఎన్టీయూసీ విజయం ఖాయమన్నారు. కష్టపడే వారికే పదవులు అని ఆయన తెలిపారు. ఆయనను కలిసిన వారిలో సెక్రెటరీ నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డు కార్మికుల సమస్యలను పరిష్కరించాలి..

సింగరేణిలో నాలుగు దశాబ్దాల పాటు పని చేసి ఉద్యోగవిరమణ పొందిన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర కనీసవేతనాల సలహామండలి చైర్మన్ జనక్‌ప్రసాద్‌కు నాయకులు విన్నవించారు. ఈ సందర్భంగా ఆ యూనియన్ అధ్యక్షుడు వాసాల శంకర్ మాట్లాడుతూ సింగరేణిలో తమకు రావాల్సిన ఆర్థికపరమైన బెనిఫిట్స్ రావడం లేదని తెలిపారు.

ప్రధానంగా 11వ వేజ్‌బోర్డుకు సంబంధించిన పెన్షన్ అమలుతోపాటు ఏరియర్స్ చెల్లించేలా చూడాలన్నారు. 2018లో ఉద్యోగ విరమణ పొందిన వారికి సర్క్యులర్ ప్రకారం 20లక్షల గ్రాట్యుటీ ఇప్పించాలని తెలిపారు. విరమణ పొందిన కార్మికులకు అద్దె ప్రాతిపదికన సింగరేణి క్వార్టర్లు ఇవ్వాలని, 200 గజాల స్థలాన్ని ఇల్లు కట్టుకోవడానికి ఇవ్వాలని తెలిపారు. వీటన్నింటిపై సెక్రెటరీ జనరల్ సానుకూలంగా స్పందించినట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆసంఘం నాయకుడు నెల్లి వీరయ్య, కలీల్, రాజేషం, రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.



మనసు కోరే దసలి పట్టు

కుశ్నపల్లి చేనేత వస్త్రాలకు అతివలు ఫిదా..



- టస్సర్ డ్రెస్సులపై రాజకీయ నాయకుల మోజు
- కష్టనష్టాలతో కులవృత్తికి జీవం పోస్తున్న నేతన్నలు
- ప్రభుత్వం చేయూతనిస్తేనే టస్సర్‌కు భవిష్యత్తు

దసలిపట్టు మగువల మనసులను దోచుకుంటోంది. కొంత కాలంగా దసలి పట్టు చీరలు వాణిజ్యపరంగా అందుబాటులోకి వచ్చాయి. ఆ చీరలను వస్త్రాలయాల్లో విక్రయిస్తున్నారు. పట్టు పురుగుల పేరుతోనే ఈ పట్టుకు ఆ పేరు స్థిరపడిందని చెబుతారు.

నెన్నెల, జనవరి 15(ఆంధ్రజ్యోతి): చేనేత వస్త్ర ప్రపంచంలో కుశ్నపల్లి దసలిపట్టు తను కులీనుతోంది. ఇక్కడి నేతన్నలు నేసే టస్సర్ వస్త్రం తనదైన ప్రత్యేకతను చాటుకుంటోంది. సహజసిద్ధమైన బంగారు రంగుతోపాటు కాలానుగుణంగా కొత్త రంగుల్లో నేసే సిల్కు చీరెలు మహిళల మనసు దోచుకుంటున్నాయి. హుందాతనం కోసం రాజకీయ నాయకులు టస్సరు వస్త్రాలు ధరించేందుకు ఇష్టప డుతు న్నారు.

● సుదీర్ఘ ప్రక్రియ..

పట్టు కాయల నుంచి దారం తీసి టస్సర్ వస్త్రం నేయడం ఓ సుదీర్ఘ ప్రక్రియ. ఇంటిల్లి పాది రోజుల తరబడి కష్టపడితేనే నాణ్యమైన వస్త్రం చేతికి వస్తుంది. పట్టు కాయలు స్థానికంగా లభించక పోవడంతో చెన్నూరులోని సెరికల్చర్ కార్యాలయం నుంచి వేలంలో తెచ్చుకో వాల్సి ఉంటుంది. నాణ్యమై నవి ఎంపిక చేసి కట్టెల పొయ్యిపై కుండ లో సోడ వేసి గంటల కొద్ది ఉడకబెడతారు. వాటిని



రాట్నంతో దారం వడుకుతున్న మహిళ

బయటకు తీసి శుభ్రంగా కడిగి, బూడిద పూసి ఆరబెడతారు. పది కాయల నుంచి వచ్చే అతి సన్నని పోగులను దారంగా పేని కండెలు చుడతారు. వంద కాయలకు 60 గ్రాముల దారం మాత్రమే వస్తుంది. ఆ దారాన్ని పడుగు వేస్తారు. రాత్రి పూట పడుగును గంజిలో నానబెట్టి సూర్యోద యానికి ముందు విశాలమైన ప్రదేశంలో ఆరబెడ్తారు. ఆ తర్వాత కుంచెతో దారాన్ని చిక్కులు లేకుండా సరి చేసుకుంటారు. 3600 పోగుల(26 పుంజాలు)తో మగ్గంపై అచ్చు అతుకుతారు. ఈ ప్రక్రియకే రెండు రోజుల సమయం పడతుంది. మూడో రోజు నుంచి నేత మొదలు పెడతారు. 18 నుంచి 20 రోజులు మగ్గం నడిపితే 12 మీటర్ల వస్త్రం తయారవుతుంది.

● ధర అంతంత మాత్రం..

వస్త్రం తయారీకి కష్టంతోపాటు పెట్టుబడి ఎక్కువే అయినప్పటికి ధర అంతంత మాత్రం గానే ఉందని నేత కార్మికులు చెప్పారు. ఆరువేల రూపాయలకు వెయ్యి కాయలు మాత్రమే వస్తాయి. ఇతర రాష్ట్రాల్లో దిగుబడి లేకపోవడంతో అక్కడి వారంత వచ్చి వేలంలో పాల్గొంటున్నారు. వేలంపాటలో ఇతర రాష్ట్రాల వారితో పోటీపడి కాయలు దక్కించుకోవాల్సి వస్తోందని చెప్పారు. ప్రభుత్వం స్థానిక నేతన్నలకు 50 శా తం సబ్సిడీ ఇస్తున్నప్పటికి ఎప్పుడు వస్తుందో తెలియదని పేర్కొన్నారు.

● ఆ లుక్కే వేరు..

సహజమైన బంగారు వర్ణంలోని దసలి పట్టు చీర ధరిస్తే పుత్తడిబొమ్మలా మెరిసిపోతామని అతివలు మురిసిపోతారు. టస్సర్ షర్టులు, లాల్చీలు ధరిస్తే డాబు దర్పం ఉట్టిపడుతుందని రాజకీయ నాయకులు చెప్పారు. టస్సర్ వస్త్రం సహజంగా బంగారు వర్ణంలో ఉంటుంది. ఎక్కువ మంది ఈ రంగు వస్త్రాన్నే ఇష్టపడతారు. ఇప్పుడు టస్సర్‌కు సహజ సిద్ధంగా తయారు చేసిన రంగులు అద్ది బూటా, జరీ కూడా వేస్తున్నారు. చాలా మంది ప్లేన్ చీరెలు తీసుకొని కంప్యూటర్ ఎంబ్రాయిడరీ, మగ్గం వర్క్‌తో డిజైన్లు వేయించుకుంటున్నారు. టస్సర్ సిల్క్ తో మోడ్రన్‌గా డిజైన్ చేసిన చుడిదార్లు, పంజాబీ డ్రెస్సులను యువతులు ఇష్టంగా ధరిస్తున్నారు.

కుశ్నపల్లి టస్సర్‌ను బతికించుకోవాలి

- లిక్కి శంకరయ్య, నేత కార్మికుడు



పేరు ప్రఖ్యాతలున్న కుశ్నపల్లి టస్సర్‌ను బతికించుకోవాలి. వృత్తిపై అభిమానం వల్ల నష్టాలు వచ్చినప్పటికి నెట్టుకొస్తున్నాం. గతంలో ప్రభుత్వమే ముడి సరుకులిచ్చి వస్త్రాన్ని కొనుగోలు చేసేది. దస్తకార్ లాంటి సంస్థలు కాటన్‌కు ఇస్తున్నట్టు టస్సర్‌కు ప్రోత్సాహం ఇవ్వాలి. కాయలపై ఇచ్చే సబ్సిడీని మరింత పెంచాలి. రాయితీ సైతం కల్పించాలి.

గృహ వసతి లేక అవస్థలు..

- పొలాస మోహన్, నేత కార్మికుడు



చేనేతపై ఆధారపడి జీవిస్తున్న వారికి గృహ వసతి లేక అవస్థలు పడుతున్నారు. చేనేత కార్మికులకు ఇందిరమ్మ ఇళ్లు ఇస్తే మగ్గాలు పెట్టుకొని నేత పని చేసుకుంటారు. నిధుల లేమితో నిలిచిపోయిన కమ్యూనిటి భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలి. ఇక్కడి నేత కార్మికులకు ఎలాంటి బీమా పథకాలు వర్తించడం లేదు.

కొత్త రేషన్ కార్డులకు మోక్షం

5వ పేజీ తరువాయి..

అందించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. కాగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా రేషన్‌కార్డుల జారీకి మోక్షం కలగలేదు. ఎట్టకేలకు కార్డులు అందిస్తామన్న ప్రభుత్వ ప్రకటన దరఖాస్తుదారుల్లో మళ్లీ ఆశలు చిగురింపజేస్తోంది.

● జిల్లా వ్యాప్తంగా..

జిల్లాలో రేషన్ కార్డుల కోసం సుమారు 15వేల పైగా దరఖాస్తులు వచ్చాయి. ఆ తర్వాత కొత్త రేషన్ కార్డుల జారీ కోసం రాష్ట్ర ప్రభుత్వం పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి చైర్మన్‌గా, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, దామోదర రాజనర్సింహా సభ్యులుగా మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసింది. ఈ ఉప సంఘం అర్హులైన వారికి రేషన్‌కార్డుల జారీకి సంబంధించిన విధి విధానాలను ఖరారు చేసింది. 2023 డిసెంబరు 2వతేదీనుంచి దరఖాస్తులు స్వీకరిస్తామని ప్రకటించినప్పటికీ, ఆ కార్యక్రమాన్ని వాయిదా వేసింది. ప్రస్తుతం లైన్ క్లియర్ కావడంతో దరఖాస్తుదారులు హర్షం వ్యక్తం చేస్తుండగా, ఈ మధ్యకాలంలో కొత్తగా వివాహం అయిన వారు, వేరు కాపురాలు పెట్టినవారు రేషన్ కార్డులకు దరఖాస్తు చేసేందుకు ఉత్సాహంతో ఉన్నారు. ఇదిలా ఉండగా రేషన్ కార్డులు లేక మార్చి 1 నుంచి అమల్లోకి వచ్చిన రూ.500కే సబ్సిడీ వంట గ్యాస్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సౌకర్యం పొందలేకపోతున్నారు. రేషన్‌కార్డు ఆధారంగా రూ. 2 లక్షల వరకు రైతులకు రుణమాఫీ చేయగా, కార్డులు లేని వారికి రుణమాఫీ కాలేదు. అదే రేషన్ కార్డు ఉంటే అందరితో పాటు తమకు కూడా రుణమాఫీ అయ్యేదని రైతులు చెబుతున్నారు.

● కులగణన సర్వే ప్రామాణికంగా..

- కొత్త ఆహార భద్రత (రేషన్) కార్డులు మంజూరు చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం కుల గణన సర్వేను ప్రామాణికం చేయనుంది.
- కుల గణన సర్వే ఆధారంగా తయారు చేసిన జాబితా ప్రకారం కార్డుల పంపిణీ జరుగనుంది.
- మండల స్థాయిలో ఎంపీడీవో, మున్సిపల్ కమి షనర్లు ప్రక్రియను పర్యవేక్షిస్తారు.
- జిల్లా స్థాయిలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) లేదా డీసీఎస్‌వో పర్యవేక్షకులుగా ఉంటారు.
- ముసాయిదా జాబితాను గ్రామసభ, వార్డు సభ ల్లో ప్రదర్శించిన అనంతరం ఆమోద ముద్ర వేస్తారు.
- గ్రామసభ, వార్డు సభల్లో ఆమోదించిన లబ్ధిదారుల అర్హత జాబితాను మండల, మున్సిపల్ స్థాయిలో జిల్లా కలెక్టర్ లాగిన్‌లో పొందు పరుస్తారు.
- జాబితాపై కలెక్టర్ సంతృప్తి చెందిన తరువాత కమిషనర్ (సీసీఎస్) లాగిన్‌కు పంపుతారు.
- కలెక్టర్ పంపిన తుది జాబితా ప్రకారం 26 నుంచి కొత్త రేషన్ కార్డులు జారీ చేస్తారు.

నిధులు మంజూరు చేయాలని వినతి

లక్షెట్టిపేట, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అంబేద్కర్ సంఘ భవనం నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని మంగళవారం రాత్రి ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావును సంఘం సభ్యులు తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం మండల అధ్యక్షుడు ముల్కల్ల రాందాస్, ప్రధానకార్యదర్శి బైరం రవి, యువజన సంఘం నాయకులు శనిగారపు లింగన్న, మాజీ మండల అధ్యక్షుడు దొంత నర్సయ్య, సభ్యులు దేవేందర్, జనార్ధన్, గరిసె రవీందర్, సత్తన్న, రాజు, ప్రేంసాగర్, రవీందర్, శ్రీనివాస్, సమ్మయ్య, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముల్కల్లలో షటిల్ పోటీలు

హాజీపూర్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముల్కల్లలో సంక్రాంతి పండగను పురస్కరించుకుని కాంగ్రెస్ నాయకుడు నాయికిని సురేందర్ మంగళ, బుధవారం షటిల్ పోటీలు నిర్వహిం చారు. రెండు రోజులు జరిగిన ఈ టోర్నమెంట్‌లో 16 టీంలు పాల్గొన్నాయి. ఫైనల్‌లో గడ్డం కృష్ణమూర్తి జట్టు గెలిచి మొదటి బహుమతి అందుకున్నారు.

ఖాళీ బిందెలతో కాలనీవాసుల నిరసన



ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న కాలనీవాసులు

భీమారం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): వారం రోజులుగా తమ కాలనీలో నీరు రావడం లేదని మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీవాసులు ఖాళీ బిందెలతో బుధవారం నిరసన చేపట్టారు. పలువురు మాట్లాడుతూ బోరు మోటారు చెడిపోవడంతో తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామన్నారు. అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. దూర ప్రాంతాలకు వెళ్లి నీటిని తెచ్చుకోవాల్సి వస్తుందన్నారు. వెంటనే నీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వడ్లకొండ రాజేశ్వరి, దుర్గయ్య, శనిగారపు లచ్చయ్య, లక్ష్మీసమ్మక్క తదితరులు పాల్గొన్నారు. కాగా ఖాజీపల్లి గ్రామంలో మోటారు చెడిపోవడంతో గత నెల రోజులుగా తాగు నీటికి ఇబ్బందులు పడుతున్నామనిప్రజలు ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

అర్హులకు రేషన్‌కార్డులు

బెల్లంపల్లి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అర్హత కలిగిన ప్రతి కుటుంబానికీ రేషన్ కార్డు అందించే దిశగా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నానని కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. బుధవారం పట్టణంలోని 11వ వార్డులో, బూదాలాన్ గ్రామంలో పర్యటించారు. రైతు భరోసా, రేషన్‌కార్డులు ఇతర సంక్షేమపథకాల సర్వేను పరిశీలించారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు ఇతర ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలపై క్షేత్రస్థాయిలో సమగ్ర పరిశీలన జరిపి అర్హులైన లబ్దిదారుల జాబితాను రూపొందించాలన్నారు. అర్హులైన ప్రతీ లబ్ధిదారుడికి పథకాల ఫలాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం ఈ నఎల 26న గణతంత్ర దినోత్సవం సందర్భంగా అమలు చేస్తున్న పథకాల్లో అర్హులైన లబ్ధిదారుల జాబితాను రూపొందించడంలో అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. రైతు భరోసా పథకానికి అర్హులైన వారి జాబితా తయారు చేయాలని అధికారులకు సూచించారు. నూతన రేషన్ కార్డుల కోసం అర్హులైన వారి జాబితాను రూపొందించాలన్నారు. పట్టణంలోని 11వ వార్డులో రేషన్ కార్డు కోసం 1301 దరఖాస్తులు అందాయని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హుల జాబితాను రూపొందించాని సూచించారు. సర్వేలో అవకతవకలు జరుగకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సర్వే పకడ్బందీగా చేపట్టాలి

తాండూర్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : రైతు భరోసా సర్వేను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం తాండూర్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 26 నుంచి ప్రభుత్వం రైతు భరోసా పథకాన్ని అమలు చేయడాని నిర్ణయించిందని చెప్పారు. రైతులకు పెట్టుబడి సాయం రూ. 12 వేలు పెంచినట్లు తెలిపిందన్నారు. నమోదైన వ్యవసాయ ధరణి లేదా రెవెన్యూ రికార్డుల్లో నమోదై యోగ్యమైన బూము లకే ఈ సాయం దక్కుతుందని , వ్యవ సాయ యోగ్యం కాని భూములను రైతు భరోసా నుంచి తొలగించాలని స్పష్టం చేశారు. గ్రామాల్లో టీంల వారీగా క్షేత్రస్థాయిలో సాగు భూములను సర్వే చేసి నివేదికలను ఈ నెల 21లోపు అందించాలని ఆదేశించారు. సర్వే పొరపాట్లు జరుగందని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో హరికృష్ణ, డీటీ ప్రసాద్, ఎంపీడీవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



బెల్లంపల్లిలో సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్‌దీపక్

ఘనంగా ఆర్మీ డే

గర్మిళ్ల, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం ఆర్మీడేను ఘనంగా నిర్వహించారు. భారత సైన్యంలో సేవలందించిన ఆరుగురు మాజీ సైనికులను ఘనంగా శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు. కాగా మంచిర్యాల వాసవి క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం మాజీ సైనికులు మాజిద్, సత్యనారాయణను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు సురేందర్, కార్యదర్శి మహేష్, కోశాధికారి సత్యనారాయణ, బాలమోహన్, ప్రవీణ్‌కుమార్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

భీమారం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో రేషవేని శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం ఆర్మీడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఆర్మీ ఉద్యోగులు కొమ్ము రాజన్న యాదవ్, ఆవుల మహేష్ యాదవ్‌ను సన్మానించారు. ఆర్మీలో వారు చేసిన సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. కార్యక్రమంలో శ్రీనివాస్, ఫిరోజ్, సురేందర్, మల్లేష్, సత్యనారాయణ, నాగరాజు, సంతోష్, నరేష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

తాండూర్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : దేశ రక్షణలో జవాన్‌ల సేవలు మరువలేనివని వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ డిస్టిక్ 107ఏ కార్పోరేట్ వైస్ చైర్మన్ గోల్డెన్ స్టార్ సంతోష్‌కుమార్ అన్నారు. బుధవారం ఆర్మీ దినోత్సవం సందర్భంగా శ్రీనగర్ (జమ్ముకాశ్మీర్)లో విధులు నిర్వహిస్తున్న తాండూర్ మండల కేంద్రంలో సుభద్రనగర్‌కు ఆర్మీ జవాన్ పుప్పాల లక్ష్మణ్‌ను మాదారం టౌన్‌షిప్‌కు చెందిన ఆర్మీ జవాన్ గోనె రాజేంద్ర ప్రసాద్ మృతిచెందగా ఆయన తల్లి గనె రాజమ్మను శాలువాతో ఘనంగా సత్కరించి స్వీట్లు అందజేశారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ అధ్యక్షుడు మైలారపు మధుసూదన్, కార్యదర్శి మనికృష్ణ, కోశాధికారి రాచకొండ మహేష్, సభ్యులు రమేష్, భాస్కర్, నరేష్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



మాజీ సైనికులను సన్మానిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించాలి

దండేపల్లి, జనవరి15(ఆంధ్రజ్యోతి): వాహనదారులందరు రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలని జిల్లా కలెక్టర్, ఆర్డీవో ఆదేశాల మేరకు తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు ఆటాపాటాలతో అవగాహన కల్పించారు. జాతీయ రహదారి భద్రత మాసోత్సవంలో భాగంగా దండేపల్లి మండలం తాళ్లపేటలో బుధవారం వారసంతలో రోడ్డు భద్రత నియమాలపై కళాకారులు అవగాహన కల్పించారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను విధిగా పాటించాలని చెప్పారు. మద్యం సేవించి వాహనం నడపొద్దన్నారు. బైక్‌పై వెళ్లేవారు హెల్మెట్ ధరించాలని కోరారు. కారులో వెళ్తున్న వారు సీటు బెల్టు ధరించాలన్నారు. కార్యక్రమంలో మురళి, శ్రీనివాస్, వెల్తురు పోషన్న, వరకపురం రవికుమార్, వావిలాల నాగల క్ష్మీ, చేగుంట నిరోషా తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సౌకర్యార్థం 'జంగల్ సఫారీ'



జంగల్ సఫారీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు

హాజీపూర్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణతో పాటు పర్యాటకులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించడంలో భాగంగా జిల్లా అటవీశాఖ ఆధ్వర్యంలో జంగల్ సఫారీ ఏర్పాటు చేశామని కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. లక్షెట్టిపేట రేంజ్ కవ్వాల్ టైగర్ రిజర్వు పరిధిలోని హాజీపూర్ మండలం ర్యాలీగడ్‌పూర్ గ్రామ సమీపంలో ఏర్పాటు చేసిన జంగల్ సఫారీ కార్యక్రమాన్ని మంగళవారం ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు, జిల్లా అటవీ అధికారి శివ్‌ఆశిష్‌సింగ్‌లతో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వన్య ప్రాణుల సంరక్షణ కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని చెప్పారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ఎడ్ల బండ్ల పోటీలు

నస్పూర్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని సీతారాంపల్లి గ్రామంలో బుధవారం ఆదిలాబాద్, కరీంనగర్ ఉమ్మడి జిల్లాల స్థాయి ఎడ్ల బండ్ల పోటీలు నిర్వహించారు. ఇందులో ఆయా జిల్లాల నుంచి 11 ఎడ్లబండ్లు పోటీలో పాల్గొన్నాయి. కిలో మీటరన్నర పరుగు పందెంలో మూడు నిమిషాల 8 సెకన్స్ సమయంలో మూడు ఎడ్ల బండ్లు చేరుకున్నాయి. దీంతో సాయి వెంకట్ (సీతారాంపల్లి), విగ్నేష్ (గొల్లపల్లి, జగిత్యాల జిల్లా), భూక్య దర్బు (చెన్నూరు)లకు బహుమతులను సమానంగా అందజేశారు. 14 సంవత్సరాలుగా ఇక్కడ తాము ఎడ్ల బండ్ల పోటీలను సంక్రాంతి సందర్భంగా నిర్వహిస్తున్నామని నిర్వాహకుడు పి రంగరావు తెలిపారు. తొలిసారిగా ఒకే టైంకు మూడు బండ్లు చేరుకున్నాయని చెప్పారు. దీంతో ఒక్కొక్కరికి 7వేల రూపాయల చొప్పున మొత్తం 21 వేల రూపాయలు అందజేశామని తెలిపారు. ఈ ఎడ్ల బండ్ల పోటీలో గ్రామానికి చెందిన రంగారావుతో పాటు దెబ్బటి సాయి, తోట శ్రీకాంత్, తిప్పని భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

చెన్నూరు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండగను పురస్కరించుకుని మండలంలోని లింగంపల్లి గ్రామంలో మంగళవారం ఎడ్లబండ్ల పందాలను నిర్వహించారు. మాజీ సర్పంచు అంగ లక్ష్మీరమేష్ పందాలను ప్రారంభించారు. ఇందులో మొత్తం 12 ఎడ్లబండ్లు పాల్గొ న్నాయి. మందమర్రికి చెందిన జిట్టబోయిన రాజమల్లు మొదటి స్థానం, లింగంపల్లికి చెందిన ఉడుత ఐలేష్ రెండవ స్థానంలో నిలిచాడు. భీమారంకు చెందిన దుర్గం లక్ష్మణ్ మూడవ స్థానంలో నిలిచారు. మొదటి బహుమతి రూ. 5 వేలు, రెండవ బహుమతి రూ. 3 వేలు, మూడో బహుమతి రూ. 2 వేలు అందజేశారు. పోటీలను చూసేందుకు ప్రజలు ఆసక్తి చూపారు. కార్యక్ర మంలో మాజీ జడ్పీ వైస్ చైర్మన్ మూల రాజిరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ చల్ల రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు

ముగిసిన కబడ్డీ పోటీలు

లక్షెట్టిపేట రూరల్, జనవరి,15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకట్రావుపేట గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో సంక్రాంతి పండగను పురస్కరించుకుని మూడు రోజులుగా నిర్వహిస్తున్న బోడకుంటి మహేష్ స్మారక కబడ్డీ పోటీలు బుధవారం ముగిశాయి. ఈక్రీడల్లో సుమారు 50జట్లు పాల్గొన్నాయి. ఛత్రపతి శివాజీ జట్టు గెలుపొందింది. భజరంగ్ జూనియర్ జట్టు ద్వితీయ స్థానం, భజరంగ్ సీనియర్ జట్టు తృతీయ స్థానంలో నిలిచింది. గెలుపొందిన జట్లకు లక్షెట్టిపేట ఎస్సై-2 పనాస రాజయ్య నగదు బహుమతితో పాటు మెమోంటోను అందజేశారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ యేటా గ్రామంలో సంక్రాంతి పండగకు మూడు రోజుల ముందు కబడ్డీ పోటీలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు.కార్యక్రమంలో బోడకుంట రమేష్, మహేష్, మారుతి, సుధాకర్, నరేష్, శ్రీహరి, తోట సాగర్, మీన శ్రీనివాస్, బియ్యాల వెంకటేష్, తిప్పని మనోహర్, కోన అరుణ్, మహేష్, సత్తయ్య, అంకతి శ్రీనివాస్, నలిమెల రాజు, కిష్టయ్య, గంగాధర్, శంకరయ్య, బుచ్చయ్య, రాంచంద్ర, చిన్నయ్య పాల్గొన్నారు.



బహుమతి అందజేస్తున్న ఎస్సై రాజయ్య,

ఘనంగా భీమదేవర జెండా పండుగ

బెజ్జూరు, జనవరి 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుశ్నపల్లి గ్రామంలో బుధవారం కొలావార్‌లు జెండా పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెండాను ఆవిష్కరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కొలావార్ నాయకులు శంకర్, వెంకటష్, మధునయ్య, సంతోష్, లక్ష్మినారాయణ, వసంత్, శంకర్, ధర్మయ్య, మహేష్, మధు కర్, బక్కయ్య, సతీష్, వెంకటేష్, మల్లేష్, శ్రీను, గణపతి, సాంబయ్య, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

కమ్మర్‌గాంలో వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభం

పెంచికలపేట, జనవరి 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని కమ్మర్‌గాంలో ఎమ్మెల్సీ దండెవిఠల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కుమరంభీం స్మారక వాలీబాల్ టోర్నమెంట్‌ను బుధవారం మాజీజడ్పీటీసీ పుష్పలత ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణ, సాయి, మధునయ్య, శంకర్‌గౌడ్, శ్రీనివాస్, చందు, బాపు, మల్లేష్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

రెబ్బెన, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి ఏరియా గోలేటి, మాదారం టౌన్‌షిప్‌లలో సింగరేణి సేవా సమితి ద్వారా అందించనున్న వృత్తి శిక్షణ కోర్సులు నేర్చుకునేందుకు ఆసక్తి గల వారు దరఖాస్తులు చేసుకోవాలని అధికార ప్రతినిధి రెడ్డిమల్ల తిరుపతి ఒక ప్రకటనలో తెలిపారు. మాదారంలో యోగా, ఫ్యాషన్ డిజైనింగ్, మగ్గం, బ్యూటీషియన్ కోర్సులు, గోలేటిలో యోగా, బ్యూటీషియన్, ఫ్యాషన్ డిజైనింగ్, డీటీపీ కోర్సుల్లో ఉచితంగా శిక్షణ ఇస్తామన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈనెల 18వ తేదీ సాయంత్రం 5గంటల వరకు జీఎం కార్యాలయంలోని ఏటీబీసెల్‌లో దరఖాస్తులను అందజేయాలని కోరారు. ఇతర వివరాలకు 9951214116ను సంప్రదించాలన్నారు.

గిన్నెధరిలో 12 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదు

ఆసిఫాబాద్‌రూరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో బుధవారం తిర్యాణి మండలంలోని గిన్నెధరిలో 12.0డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయింది. సిర్పూర్ (యు)లో 12.2, తిర్యాణిలో 12.4, ధనోరలో 13.3, కెరమెరిలో 13.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయింది.

మరింత 'సహకారం'..

జిల్లాలో మరిన్ని కొత్త సొసైటీలు



- ప్రస్తుతం 12సంఘాలు, 23,788 మంది సభ్యులు
- మరో మూడు కొత్త వాటికోసం ప్రతిపాదనలు

ఆసిఫాబాద్‌రూరల్, జనవరి 15(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ఆర్థికవ్యవస్థలో ప్రధానమైన వ్యవసాయ రంగానికి వెన్ను దన్నుగా నిలిచే సహకార సంఘాలను మరింత బలోపేతం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా సహకార సంఘాల సేవలు విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు జిల్లా వ్యాప్తంగా నూతన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఏర్పాటు కోసం ప్రతిపాదనలు పంపించారు. ముందుగా ఆయా పీఏసీఎస్‌లు, ఎమ్మెల్యేల నుంచి ప్రతిపాదనలను జిల్లా సహకారశాఖ స్వీకరించింది. జిల్లాలో నూతనంగా మూడు సంఘాలను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు.


ఆసిఫాబాద్‌లోని సహకార సంఘం కార్యాలయం

గ్రామాల్లో సేవలు విస్తరించేందుకు..

జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం 12 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు ఉన్నాయి. అందులో 23,788వేలు సభ్యులున్నారు. విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల విక్రయాలు, ప్రభుత్వ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోళ్లు, పంట రుణాల పంపిణీ, గిడ్డంగులు ఇలా పలు సేవలు రైతులకు అందిస్తున్నాయి. కొత్తగా మండలాలు ఏర్పడినప్పటికీ మండల కేంద్రాల్లో పీఏసీఎస్‌లు లేవు. ఈ క్రమంలో అన్ని మండల కేంద్రాల్లో అవసరం ఉన్న గ్రామాల్లో సహకార సంఘాలు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం దృష్టి సారించింది.

15కి చేరుకోనున్న సంఘాలు..

కొన్ని సంవత్సరాలుగా కొత్తగా సంఘాలు ఏర్పాటు చేయ లేదు. గతంలో నష్టాల్లో ఉన్న సంఘాలను మరో సంఘంలో విలీనం చేశారే తప్ప కొత్తవి ఏర్పాటు చేయలేదు. పలుపాత, కొత్త మండల కేంద్రాల్లో సైతం సంఘాలు ఏర్పాటు చేయలేదు. గత ప్రభుత్వం మండలానికి రెండు సంఘాలు ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు స్వీకరించింది. కానీ ఏర్పాటు చేయలేదు. మళ్లీ ఇటీవల కొత్త,పాత మండల కేంద్రాల్లో సంఘాలను ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు స్వీకరించారు. కొత్తగా మూడు సంఘాలు ఏర్పాటు చేస్తే జిల్లాలో సహకార సంఘాలు 15కి చేరుకుంటాయి. దీంతో రైతులకు అందుబాటులో సేవలు ఉంటాయి.

ప్రతిపాదనలు పంపించాం..

రాథోడ్ బిక్కు, జిల్లా సహకార అధికారి



ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా ప్రతిపాదనలను స్వీకరించాం. అందరి అభిప్రాయాలను తీసుకొని నివేదించాం. జిల్లాలో కొత్తగా పెంచికల్‌పేట, చింతలమానేపల్లి, లింగాపూర్‌లో సంఘాలు ఏర్పాటు కోసం ప్రతిపాదనలు పంపించాం.

క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హుల జాబితా రూపొందించాలి

ఆసిఫాబాద్‌రూరల్, జనవరి 15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వసంక్షేమ పథకాలైన రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డులు, ఇతర పథకాలపై క్షేత్రస్థాయిలో సమగ్రపరిశీలన జరిపి గ్రామసభల ద్వారా అర్హులైన లబ్ధిదారుల జాబితాను రూపొందించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్‌లు దీపక్ తివారి,డేవిడ్‌తో కలిసి ప్రత్యేకాధికారులు, తహసీల్దార్‌లు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, ఏవోలు, కార్యదర్శులు, జిల్లా అధికారులతో ప్రభుత్వసంక్షేమ పథకాల అమలుపై సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాసంక్షేమ పథకాల అమలు ద్వారా జిల్లాలోని అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి పథ కాల ఫలాలు అందేలా అధికారులు కృషి చేయాలని తెలి పారు. ప్రభుత్వం ఈనెల 26న గణతంత్ర దినోత్సవం సందర్భంగా అమలు చేస్తున్న పథకాలలో అర్హులైన లబ్ధిదారుల జాబితాను రూపొందించడంలో అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేష న్‌కార్డుల కొరకు వచ్చిన దరఖాస్తుదారులలో అర్హులైన వారిని ఎంపిక చేసేందుకు ఈ నెల16నుంచి 19వతేదీ వరకు క్షేత్రస్థాయిలో పరిశీలనజరిపి జాబితాను రూపొందించాలని తెలిపారు. ఈనెల21, 22తేదీల్లో గ్రామసభలో జాబితా ఆమోదం ద్వారా అర్హుల జాబితాను జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అందించాలన్నారు. రేషన్ కార్డుల కోసం వచ్చన దరఖాస్తుల పూర్తి వివరాలను నమోదు చేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న వారి వార్షిక ఆదాయం రూ.1.50లక్షలు, పట్టణ ప్రాంతాల్లో ఉన్న వారికి రూ.2లక్షలు మించి ఉండకూడదన్నారు. రేషన్ కార్డులకోసం పేర్ల తొలగింపులు, చేర్పులు, నూతన కార్డుల కోసం అర్హతగలవారి జాబితాను రూపొందించాలన్నారు. వారి ఆదాయ వివరాలు నమోదు చేయాలని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లసర్వేప్రక్రియ జిల్లాలో 97శాతం పూర్తి అయిందని, మిగితా వారి వివరాలను నమోదు చేయాలని తెలిపారు. అర్హులైన వారిజాబితా రూపొందించి మరోసారి క్షేత్రస్థాయిలో వెళ్లి పరిశీలించాలన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ప్రజాపాలన ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించాలి

వాంకిడి, జనవరి 15(ఆంధ్రజ్యోతి): ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులపై నిర్వహించిన సర్వేను క్షేత్రస్థాయిలో అధికారులు పరిశీంచాలని మండల ప్రత్యేకాధికారి రాథోడ్‌బిక్కు అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో ప్రభుత్వ పథకాలకు అర్హుల జాబితాఎంపిక ప్రక్రియపై అధికారులతో బుధవారం ప్రత్యేకసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గురువారం నుంచి మండలంలోని అన్ని గ్రామపంచాయతీల్లో క్షేత్రస్థాయి పరిశీలన బృందాల ద్వారా రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డుల అర్హులను క్షేత్రస్థాయిలో గుర్తించాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ అధికారులు, ఉపాధిహామీ సిబ్బంది, వ్యవసాయశాఖ ఏఈవోలతో రెవెన్యూ గ్రామాల వారీగా బృందాలను ఏర్పాటు చేసి పరిశీలన జరిపి లబ్ధిదారుల జాబితాలను తయారు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, తహసీల్దార్ రియాజ్ అలీ, ఎంపీవో అజీజుద్దీన్, ఏపీవో శ్రావణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామసభల ద్వారా లబ్ధిదారుల ఎంపిక చేపట్టాలి: జడ్పీ సీఈవో

కెరమెరి, జనవరి 15(ఆంధ్రజ్యోతి): గ్రామసభల ద్వారా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక నిర్వహించాలని జడ్పీ సీఈవో లక్ష్మినారాయణ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో రైతుభరోసా, ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులపై రెవెన్యూ, వ్యవసాయ అధికారులు బృందాలుగా ఏర్పడి గ్రామాల్లో 16నుంచి 19వ తేదీవరకు సర్వే పూర్తి చేయాలన్నారు. 21వ తేదీనుంచి 23 వరకు గ్రామసభలు నిర్వహించి లబ్ధిదారులను గుర్తించాల న్నారు. సమావేశంలో ఎంపీడీవో అంజద్‌పాషా, తహసీల్దార్ దత్తుప్రసాద్‌రావు, డీటీ సంతోష్‌కుమార్, ఏపీవో మల్లయ్య, కార్యదర్శులు పాల్గొన్నారు.

మహాధర్నా కరపత్రాలు విడుదల


కరపత్రాలు విడుదల చేస్తున్న ఆదివాసీ సంఘాల నాయకులు

జైనూర్, జనవరి 15(ఆంధ్రజ్యోతి): ఉట్నూరు ఐటీడీఏ కార్యాలయం ఎదుట ఈ నెల20న తలపెట్టిన మహాధర్నా కరపత్రాలను బుధవారం ఆదివాసీ సంఘాల నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆదివాసీ సంక్షేమపరిషత్ జిల్లాఅధ్యక్షుడు మడావి మనోహర్ మాట్లాడుతూ ఆదివాసులకు జరుగుతున్న తీవ్రమైన అన్యాయానికి వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా రాష్ట్రంలోని అన్ని ఐటీడీఏ కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహిస్తున్నామన్నారు. జీవోనం.3, గిరిజన సంక్షేమశాఖలోని 29విభాగాల్లో ఆదివాసులకు రిజర్వేషన్ సంబంధిత జీవోలకు ఒకే చట్టం చేయాలన్నారు. ఏజెన్సీప్రాంతంలో 1/70, పెసా, అటవీహక్కుల చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలన్నారు. పోడుభూములకు పట్టాలు ఇచ్చి ఆదివాసులకు శాశ్వతహక్కులు కల్పించాలని కోరారు. 50శాతం జనాభా ఉన్న ఆదివాసీ గ్రామాలను ఏజెన్సీ గ్రామాలుగా గుర్తించాలన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి సెడ్మకీ రామారావ్, గౌరవ అధ్యక్షుడు మేస్రం షేకు, మహాగాం సార్మేడి ఆత్రం ఆనంద్‌రావ్, మాజీసర్పంచ్ కుంర శాంరావ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మడావి క్రిష్ణ పాల్గొన్నారు.

క్రీడాకారులు రాష్ట్ర స్థాయికి ఎదగాలి


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న నాయకులు

వాంకిడి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు జిల్లా, రాష్ట్ర స్థాయికి ఎదగాలని బీఎస్‌ఐ జిల్లా అధ్యక్షుడు మహోల్కార్ అశోక్, ఎల్ఎస్ఎస్ చైర్మన్ గాదే అవినాష్ కోరారు. మండల కేంద్రంలో టైగర్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మండల స్థాయి వాలీబాల్ పోటీలను బుధవారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడలు శారీరక, మానసిక ఆరోగ్యానికి దోహదపడతాయన్నారు. క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని ఓటమిపాలైన వారు నిరుత్సాహ పడకుండా మరోసారి గెలుపుకోసం ప్రయత్నించాలన్నారు. క్రీడాకారులు జిల్లా, రాష్ట్రస్థాయికి ఎదిగేలా కృషిచేయాలన్నారు. క్రీడలతో స్నేహ సంబంధాలు పెరిగి యువత చెడువ్యసనాలకు దూరంగా ఉండడానికి దోహదపడతాయన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించడానికి ఎల్లవేళలా తమవంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో శివాలయ కమిటీచైర్మన్ గాదే ప్రవీణ్, కాంగ్రెస్‌పార్టీనాయకులు గుర్నులేనారాయణ, దుర్గం ప్రశాంత్, అంబేద్కర్‌సంఘం నాయకులు విలాస్, ప్రతాప్ రాంటెంకి, టైగర్స్‌క్లబ్ నిర్వాహకులు, గ్రామాలక్రీడాకారులు పాల్గొన్నారు.

పథకాలపై క్షేత్రస్థాయిలో పరిశీలన

బెజ్జూరు, జనవరి 15(ఆంధ్రజ్యోతి): మండలంలో గురువారం రేషన్ కార్డు, ఇందిరమ్మఇల్లు, ఇందిరమ్మ ఆత్మీయభరోసా, రైతుభరోసా పథకాలపై క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో గౌరిశంకర్ తెలిపారు. వ్యవసాయశాఖ, రెవెన్యూ, పంచాయతీ రాజ్‌శాఖ అధికారులు పరిశీలన చేయనున్నట్లు తెలిపారు. పథకాలపై దరఖాస్తు చేసుకున్న వారి ఇంటింటికి వెళ్లి పరిశీలన చేస్తామన్నారు. ఈ నెల21 నుంచి 25 వరకు గ్రామసభలు నిర్వహిస్తామని తెలిపారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

వాంకిడి, జనవరి 15(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని లక్ష్మినగర్ కాలనీకి చెందిన అక్కెపల్లి ఆనంద్‌రావుకు బుధవారం టైగర్‌క్లబ్ సభ్యులు నిత్యావసర సరుకులు అందజేశారు. అక్కెపల్లి ఆనంద్‌రావు కొంత కాలంనుంచి పక్షవాతంతో బాధపడుతున్నాడు. బాధితుడి కుటుంబ సభ్యులకు ఎలాంటి అవసరమున్నా తనవంతు సహకారం అందిస్తానన్నారు. కార్యక్రమంలో టైగర్స్‌క్లబ్ సభ్యులు రొడ్డశంకర్, రహీమ్, మల్లేష్, సాయ, రాజు తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి

ఆసిఫాబాద్‌రూరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు నిబంధనలు పాటించాలని సీఐ బుద్దె రవిందర్ అన్నారు. బుధవారం పట్టణంలోని ఆయాకూడళ్ల వద్ద నిర్వహించిన వాహనతనిఖీల్లో పట్టుబడ్డ వాహనదారులకు స్థానిక పోలిస్‌స్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ వాహనదారులు పూర్తి ధ్రువపత్రాలను కలిగి ఉండాలన్నారు. మద్యం తాగి వాహనం నడపవద్దని, హెల్మెట్ ధరించాలన్నారు.ట్రాఫిక్‌రూల్స్ పాటించాలన్నారు. మైనర్‌లకు తల్లిదండ్రులు వాహనాలను ఇవ్వరాదన్నారు.

అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు

- జిల్లా వ్యాప్తంగా ఘనంగా వేడుకలు
- ప్రత్యేక పూజలు.. నోములు..
- తీరొక్క రంగుల ముగ్గులతో అందంగా లోగిళ్లు


ఆసిఫాబాద్:బాబాపూర్‌లో ఎండ్లబండి పోటీలను తిలకిస్తున్న ప్రజలు


ఆసిఫాబాద్:విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి


పెంచికలపేటలో ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు, యవతులు

ఆసిఫాబాద్‌రూరల్, జనవరి 16(ఆంధ్రజ్యోతి): మకర సంక్రాంతి పర్వదినాన్ని మంగళవారం జిల్లా వ్యాప్తంగా ప్రజలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంతో పాటు మండలాల్లో పండగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. సంక్రాంతిని పురస్కరించుకుని మహిళలు తమ ఇళ్ల లోగిళ్ల ముందు రంగు రంగుల ముగ్గులను వేసి అందంగా తిర్చిదిద్ది గొబ్బెమ్మలను పూలతో అందంగా అలంకరించి ముగ్గుల మధ్యలో పెట్టారు. పిండి వంటలను తయారు చేశారు. అయ్యప్ప ఆలయంలో భక్తులు ప్రత్యేకపూజలు నిర్వహించి దీపోత్సవ కార్యక్రమాన్ని చేపట్టారు. మహిళలు తమ ఇళ్లలో ప్రత్యేక నోములు నోచుకుంటూ వాయినాలను ఇచ్చిపుచ్చుకున్నారు. అలాగే యువకులు, చిన్నారులు పతంగులు ఎగురవేసి ఆనందంగా గడిపారు. బాబాపూర్ గ్రామంలో నవనిర్మాణయూత్ ఆధ్వర్యంలో ఎండ్ల బండ్లు, కబడ్డీపోటీలను నిర్వహించారు. ఎండ్లబండి పోటీల్లో మొదటి బహుమతి మంచిర్యాల జిల్లా టేకులపల్లి గ్రామానికి చెందిన మల్లేష్, ద్వితీయ బహుమతి ఆసిఫాబాద్ మండలం దద్పపూర్ గ్రామానికి చెందిన ఉప్పరి రాజేష్ గెలుపొందారు. అలాగే కబడ్డీ పోటీల్లో మాణిక్‌గూడ మొదటిస్థానం, ద్వితీయస్థానం వాంకిడి జట్టు గెలుపొందాయి. విజేతలకు ఎమ్మెల్యే కోవ లక్ష్మి, మాజీఎమ్మెల్యే ఆత్రం సక్కు, డీసీసీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్‌రావు, సింగిల్‌విండో చైర్మన్ అలీబీన్ అహ్మద్, మాజీఎంపీపీలు బాలేశ్వర్‌గౌడ్, మల్లిఖార్జున్ యాదవ్, మార్కెట్‌కమిటీ మాజీచైర్మన్ గాదవేణి మల్లేష్ అందజేశారు. వేర్వేరుగా జరిగిన ఆయా కార్యక్రమాల్లో బీఆర్‌ఎస్‌పార్టీ మండల అధ్యక్షుడు జబరి రవిందర్, మాజీసర్పంచులు లక్ష్మి,బలరాం, తదితరులు పాల్గొన్నారు.

మండలాల్లో..

బెజ్జూరు/చింతలమానేపల్లి/పెంచికలపేట/కెరమెరి/దహెగాం/సిర్పూర్(టి): మండలాల్లోని ఆయాగ్రామాల్లో ఇళ్లముందు వివిధరకాల ఆకృతులతో అందమైన రంగువల్లులు వేశారు. చిన్నారులు గాలిపటాలను ఎగురవేశారు. కనుమ పండగ రోజు మహిళలు వివిధరకాల సామగ్రితో నోముకున్నారు. అనంతరం ఒకరికొకరు వాయినాలను ఇచ్చిపుచ్చుకున్నారు. సంక్రాంతి సంబరాలు ఆయాగ్రామాల్లో చిన్న పెద్ద తేడాలేకుండా సంబరంగా జరుపుకున్నారు. పెంచికలపేట మండలకేంద్రంలో కాంగ్రెస్ నాయకుడు కృష్ణ ఆధ్వర్యంలో ముగ్గులపోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. యువకులు ఉట్టికొట్టే కార్యక్రమం నిర్వహించారు. దహెగాంలో డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

వాంకిడి: మండలకేంద్రలోని ప్రభుత్వ ఆస్పత్రి మైదానంలో కాంగ్రెస్‌పార్టీయూత్ అధ్యక్షుడు దుర్గం ప్రశాంత్ ఆధ్వర్యంలో ముగ్గులపోటీలు నిర్వహించారు. పోటీల్లో దాదాపు80మంది యువతులు, మహిళలు పాల్గొన్నారు. పోటీల్లో గెలుపొందిన సెండేపూజకు ప్రథమ బహుమతిగా రూ.6 వేలు, సౌమ్యకు రెండవబహుమతిగా రూ.3వేలు, లావణ్యకు మూడవ బహుమతిగా రూ.1500లు మాజీఎమ్మెల్యే ఆత్రం సక్కు, డీసీసీఅధ్యక్షుడు విశ్వప్ర సాద్‌రావు అందజేశారు. కార్యక్రమంలో ఎస్సై ప్రశాం త్, కాంగ్రెస్ పార్టీ నాయకులు దీపక్‌ముండే, గుర్నులే నారాయణ, మెంగాజీ, దాదాజీ, అంబెడ్కర్ సంఘం నాయకులు దుర్గం శ్యాంరావు, విలాస్, తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్: పట్టణంలో మంగళవారం సంక్రాంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మహిళలు తమ ఇండ్ల ముందు రంగురంగుల ముగ్గులను వేశారు. ఇంట్లో పూజలు చేసుకొని నోములను నోముకున్నారు. పండుగ సందర్భంగా వివిధ ఆలయాల్లో పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలు ఒకరికొకరు వాయినాలను అందజేసి పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

రెబ్బెన: మండంలోని గ్రామాల్లో ప్రజలు మంగళవారం సంక్రాంతి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా తమ ముంగిట్లో మహిళలు ముగ్గులను వేశారు. అనంతరం నోముకున్నారు.


బెజ్జూరులో నోములు నోచుకుంటున్న మహిళలు




చింతలమానేపల్లిలో లోగిళ్లలో రంగుల ముగ్గులు


వాంకిడిలో ముగ్గులు వేస్తున్న మహిళలు


దహెగాంలో ముగ్గుల పోటీల్లో పాల్గొన్న యువతులు